క్లుప్తంగా

కొనసాగుతున్న బస్సుల తనిఖీ



పట్నంబజారు: విద్యా సంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, కాకానిరోడ్డు, రింగ్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని ఆరు బస్సులపై కేసు లు నమోదు చేశారు. ఇప్పటి వరకు 67 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ నిత్యం జిల్లా వ్యాప్తంగా ఏదో ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

చిరుజల్లులతో హాయిరే.. హాయి



నెహ్రూనగర్: ఈ వేసవిలో ఎండలు నగర ప్రజల్ని ఠారెత్తించాయి.భానుడి తీవ్రత 48 డిగ్రీల దాకా వెళ్లింది. గత 20 రోజులుగా భానుడి సెగలకు ఇంట్లోంచి బయటకు రాలేని పరిస్థితి. ఉదయం 7 గంటల నుంచే భానుడి భగభగలు, వడగాలులకు తీవ్ర ఇబ్బందులు పడిన నగరవాసులకు బుధవారం కురిసిన వర్షం కాసింత ఉపశమనం కలిగించింది. మంగళవారం మధ్యాహ్నం మేఘాలు కమ్మి వాతావరణం చల్లగా మారింది. చిన్న చిన్న జల్లులు పడి ఆగిపోవడంతో ఎండలు ప్రభావం తగ్గలేదమో అని ఆందోళనలో ఉన్న నగరవాసులకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో హమ్మయ్య అనుకున్నారు.

నేడు పెద్ద మసీదులో బహిరంగ విచారణ

లక్ష్మీపురం: సుప్రసిద్ధ షాహి జామియా మస్జిద్ (పెద్ద మసీదు)లో బహిరంగ విచారణకు రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ గురువారం ఉదయం 11 గంటలకు హాజరుకానున్నారు. మసీదు ఆస్తులు, భూములపై కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బహిరంగ విచారణ చేయాలని ఆయన నిర్ణయించారు. ఆయనతో పాటు కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏ. జాషుబా డానియేల్, సభ్యులు సయ్యద్ హిదాయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ జీత్‌సింగ్ హాజరవుతున్నట్లు కమిషన్ కార్యాలయ అధికారులు బుధవారం వెల్లడించారు. మసీదుకు సంబంధించిన ఫిర్యాదుల్ని స్థానికులు రాతపూర్వకంగా కమిషన్‌కు అందజేయవచ్చని తెలిపారు. మైనార్టీ కేటగిరీకి వచ్చే ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, పారసీల సమస్యల్ని కమిషన్‌కు నేరుగా నివేదించవచ్చని తెలియజేశారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న మహిళపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో బేబి గంజాయి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆమె నుంచి కేజీ వంద గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, రూ. 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట వాటర్ ట్యాంకుల సమీపంలో సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. మల్లెబోయిన శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 3,400తో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపై తమ్ముడు దాడి

పట్నంబజారు: అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచిరాజు వీధిలో నివాసం ఉండే భాస్కర్‌రెడ్డిపై అతని సోదరుడు నరేంద్రరెడ్డి కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బుధవారం వారి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పెదకాకాని: మండలంలోని కొప్పురావూరు శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. పది మందిని అరెస్టు, వారి నుంచి రూ. 36 వేలు స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారీ అయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి

నగరంపాలెం: రోజూ యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ (కో–ఆర్డినేషన్) పి.పార్వతి తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భారత్ స్కౌట్స్/ గైడ్స్ ఆధ్వర్యంలో ఆక్సిలియం ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పార్వతి మాట్లాడుతూ యోగా ప్రతి రోజు చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. విద్యార్థుల్లో యోగా చేసే ప్రవృత్తిని అలవర్చాలని సూచించారు. యోగా బోధించడం ద్వారా విద్యార్థుల్ని పరిపూర్ణమైన పరిపక్వత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓసీ (ఎస్) పి.శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ ఆర్.బి. జాకబ్, స్కై యోగా ట్రస్ట్ చైర్మన్ కోటేశ్వరమ్మ, ఏఎన్‌యూ యోగా ఆచార్యులు అంకినీటి ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం విక్టోరియారాణి, స్కౌట్ ఉపాధ్యాయులు అనిల్, మల్లీశ్వరి పాల్గొన్నారు. విద్యార్థుల యోగాసనాలు అలరించాయి.

జ్ఞాపకశక్తి, శారీరక దారుఢ్యం పెంపు

యోగాభ్యాసంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, శారీరక దారుఢ్యం పెరుగుతుందని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణమైన జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు చెప్పారు. యోగాసన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాల్ని ప్రిన్సిపాల్ వై.రతినిచౌదరి అందించారు. విద్యార్థుల యోగాసనాలు అలరించాయి. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ బసవపున్నయ్య, ఏఓ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

ప్రతి మహిళ యోగాను నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేచురోపతిక్ పాలకమండలి సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంతో ఐరాస చొరవతో ప్రపంచ దేశాలు యోగ విద్య విశిష్టతను తెలుసుకున్నాయని అన్నారు. మానవాళి సంపూర్ణ ఆరోగ్యానికి యోగాను మించిన సాధనం మరోకటి లేదని పేర్కొన్నారు. నిధి వనం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థినులకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి, అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ పద్మజ, సర్టిఫికెట్ కోర్స్ ఇన్‌చార్జి డాక్టర్ డి.ధాత్రీకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ అధ్యాపకులు డాక్టర్ భవాని, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ సంతోషికుమారి, యోగ శిక్షకురాలు కె.లక్ష్మి పాల్గొన్నారు.



ఆక్సిలియం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న విద్యాశాఖ డైరెక్టర్ పార్వతి

సర్వరోగాలు మాయం

గుంటూరు మెడికల్: యోగాతో సర్వ రోగాలు మాయం అవుతాయని, పిల్లలకి చిన్నప్పటి నుంచే చేయడం అలవాటు చేస్తే శారీరకంగా, మానసికంగా వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని బీజేపీ గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆయన ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలో పలువురు స్థానికులు, బీజేపీ నేతలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యాక యోగకు ప్రాముఖ్యత వచ్చిందని తెలిపారు. డాక్టర్ నక్షత్ర, యోగా గురువు బాబూరావు, మార్షల్ కోచ్ రామకృష్ణ, యోగాసనాలు నేరిప్పించారు. అనంతరం బీజేపీ నేతలు యోగా గురువుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ శనక్కాయల కార్తిక్, శనక్కాయల చందన, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, సురేష్ జైన్, శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో యోగా

గుంటూరు లీగల్: జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగా డే కార్యక్రమంలో పాల్గొని వివిధ ఆసనాలు వేశారు. కార్యక్రమంలో పీడీజే పార్థసారథి, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్, అదనపు జిల్లా జడ్జిలు రాజగోపాలరావు, జి.అర్చన, సీతారామకృష్ణారావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రమౌళీశ్వరి, ఇతర సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

పరిపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తప్పనిసరి

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూలులో పలువురు బీజేపీ నేతలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా తోట రామకృష్ణ మాట్లాడుతూ పరిపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రపంచ దేశాలకు భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపాలనే దృఢ సంకల్పంతో జూన్ 21న యోగ డే ఏర్పాటు చేశారని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ యోగా సాధన జీవితంలో ఓ భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా గురువు కొండయ్య మాస్టారును సన్మానించారు. కార్యక్రమంలో సుధాకర్ యాదవ్, ఈమని మాధవరెడ్డి, వనమా నరేంద్ర, అప్పిశెట్టి రంగ, రాచుమల్లు భాస్కర్, దర్శనం శ్రీనివాసు, పద్మనాభం, ఆవుల వెంకటేశ్వరావు, సుధాకర్, తిరుమలరావు, పార్థసారథి, కొక్కెర శ్రీనివాస్, ప్రసాద్, వెలగలేటి గంగాధర్, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.



కేఎల్‌పీ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు



యోగా కార్యక్రమంలో పాల్గొన్న పీడీజే పార్థసారథి, న్యాయాధికారులు



ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినుల యోగాసనాలు



యోగా గురువు కొండయ్యను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ప్రశాంతమైన జీవితం

నగరంపాలెం: స్థానిక ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు యోగా, క్రీడల అవశ్యకత చెప్పాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు.

భాష్యంలో..

ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చునని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం గోరంట్లలోని భాష్యం క్యాంపస్ ఆవరణలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక సమతుల్యతను సాధించవచ్చని తెలిపారు. తద్వారా విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల్ని సులభతరంగా చేరుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ మహిళా కళాశాలలో..

లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాల, ఏసీ ఎంఈ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పతంజలి యోగా శిక్షకురాలు శకుంతల, శ్రీరామచంద్ర మిషన్ శిక్షకురాలు శైలజ, వాణి విద్యార్థులకు యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.రోహిణీ దేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న బీజేపీ నేతలు



అభ్యుదయ మహిళా కళాశాలలో...



భాష్యం విద్యా సంస్థల్లో ..



యోగాసనాలు వేస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు

డ్రెయిన్లలో పూడికతీత వేగవంతం చేయండి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలోని డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని వేగంగా చేపట్టాలని, వర్షాలు రావడానికి ముందే ముగించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి బుధవారం సంపత్ నగర్, నల్ల చెరువు, జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో పీకలవాగులో పూడికతీత పనుల్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలిచ్చారు. తొలుత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. నగరంలో ఇప్పటి వరకు జరిగిన పూడికతీత పనుల శాతం, పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షాలు రావడానికి ముందే పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పూడికతీత టెండర్లు పొందిన ప్రతి కాంట్రాక్టర్ పనుల్ని నిర్దేశిత గడువులోగా చేసేలా పర్యవేక్షణ చేయాలని ఎస్ఈని ఆదేశించారు. పూడికతీతకు ముందు, తర్వాత ఫోటోలు ఉండాలని చెప్పారు. పనుల్ని ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, ప్రజారోగ్య విభాగ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తీసిన పూడికను ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, పీవో రవీంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు కొండారెడ్డి, సుందరరామిరెడ్డి, డీఈఈలు రమేష్ బాబు, కల్యాణరావు, ఏఈ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



పీకలవాగులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల్ని వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. బుధవారం కమిషనర్ తన క్యాంప్ కార్యాలయంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్ని ఏఈలు ప్రత్యేక బాధ్యత తీసుకుని పూర్తి చేయాలని చెప్పారు. వార్డుల వారీగా పనుల వేగవంతానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. పాఠశాలల్లో నాడు – నేడు పనుల పురోగతిపై ఈఈల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని ఆదేశించారు. ఈ-ఆటోలు అందుబాటులోకి వచ్చినందున గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణ పనుల్ని పూర్తి చేయాలని చెప్పారు.15 ఫైనాన్స్, ఎన్.క్యాప్ నిధులతో చేపట్టిన పనులు నిర్దేశిత గడువు మేరకు జరగడం లేదని, వాటిని ఆయా ప్రాంత డీఈఈలు ప్రత్యేక శ్రద్ధతో వేగవంతం చేయాలని ఆదేశించారు. ఐలాండ్స్ పనులు కొన్నిచోట్ల నత్తనడకన జరుగుతున్నాయని తదుపరి సమావేశం నాటికి పూర్తయ్యేలా చూడాలని ఈఈలను ఆదేశించారు. రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు. తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు పైపులైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి రోజు వాటర్ శాంపిల్స్ తీయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీకి ఘన సత్కారం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్ట్ నూతన కమిటీ అభినందన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో నూతన కమిటీకి ఘన స్వాగతం పలికారు. కమిటీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై జరిగిన సభలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిడమానూరి సురేష్, సభ్యులు కొలిశెట్టి రమాదేవి, కనమర్లపూడి మారుతి శివ వెంకట సుబ్బారావు, బైసాని ఇందువతి, దేవరశెట్టి సురేష్ బాబును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొప్పురావూరి రజని, కార్పొరేటర్ ఎస్. శ్రీనివాసరావు, సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ప్రముఖులు కోట హరిబాబు, మైనేని వెంకటేశ్వరరావు, కొండేటి సతీష్‌చంద్ర, కాకి శ్రీనివాసరావు, పప్పుల సీతారామిరెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

బక్రీద్‌ను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి

మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో బక్రీద్ పండుగను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని, నగర పాలక సంస్థకు ముస్లిం మత పెద్దలు సహకరించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు కోరారు. నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ నెల 29న జరగనున్న బక్రీద్ పండుగ నిర్వహణపై ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఆరోగ్యకర వాతావరణంలో జరుపుకోవాలని, ప్రభుత్వ నియమ, నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. అనధికార జంతు వధ నిషేధమని, నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన వధశాలను వినియోగించుకోవాని తెలిపారు. జంతు వధశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. పండుగ సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరపాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాసరావు, సీఎంవోహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, డీఎస్పీ ఉమా మహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, షేక్ మీరావలి, రామనబోయిన అజయ్, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, గోసంరక్షణ సమితి సభ్యులు ప్రదీప్ జైన్, సురేష్ జైన్, నిఖిల్ జైన్, గుంటూరు అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ కర్నూమ, సెక్రటరీ అబ్దుల్ సలాం, హిదయతుల్లా పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి నాయకులతో సమావేశమైన మేయర్ కావటి

తులసి రామచంద్ర ప్రభు జన్మదిన వేడుకలు

కొరిటెపాడు: ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు, ఆయన తనయుడు తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని తులసి రామచంద్ర ప్రభు నివాసంలో ఏర్పాటు చేసిన జన్మదిన భారీ కేకును ఆయన కట్ కట్ చేశారు. వేడుకల్లో వివిధ రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, అభిమానులు ప్రభుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు. పారిశ్రామికవేత్తగా రామచంద్ర ప్రభు, చైతన్య మరింత రాణించాలని ఆకాంక్షించారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఆత్మీయుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జూన్ 21 ప్రపంచ యోగ దినోత్సవం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తన కుమారుడు తులసి యోగీష్ చంద్ర బీజేపీలో చేరారని చెప్పారు. అరండల్ పేటలోని తులసి సంస్థల కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు, తులసి అభిమానుల సమక్షంలో అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు

పలకలూరులో చీరల పంపిణీ

తులసి రామచంద్రప్రభు, తులసి కృష్ణ చైతన్య జన్మదిన సందర్భంగా ప్రభు అభిమాని బొందలపాటి రాజు ఆధ్వర్యంలో చినపలకలూరు పోలేరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో పేద వృద్ధ మహిళలకు చీరల పంపిణీ చేశారు.కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస్, దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, తోట రామకృష్ణ, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, మల్లిశెట్టి సుబ్బారావు, ఇస్కాన్ ప్రచారకులు అప్పిశెట్టి రంగారావు, అడపా మాణిక్యాలరావు, దర్శనపు శ్రీనివాస్, వనమా నరేంద్ర, మాదాసు వెంగళరావు, వివేకానంద శ్రీనివాసరెడ్డి, రామ్మోహనరావు, హోమియో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నల్లపాటి పిచ్చయ్య, దాసరి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.



రామచంద్రప్రభును గజమాలతో సత్కరిస్తున్న నేతలు, అభిమానులు

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చేబ్రోలు: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అదృశ్యంపై బుధవారం చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ప్రెసిడెన్సీ హైస్కూల్ సమీప ప్రాంతానికి చెందిన చందు మోనీషా గుంటూరు చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రులు బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

26న కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నగరంపాలెం: ప్రభుత్వ మహిళా కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు కెమిస్ట్రీ లెక్చరర్ (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టులకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సాంబశివపేటలోని కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు పీజీలో 55 శాతం పైబడి మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొండేపాడు (ప్రత్తిపాడు): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న దాసరి అక్షయ ఏపీఆర్ఎస్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష పరీక్షలో వందకు 74 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో 73వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో హెచ్ఎం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినికి అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అన్నమ్మ అక్షయను దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ చిత్తశుద్ధితో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. హెచ్ఎం మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 2300 మంది విద్యార్థులు హాజరవ్వగా తమ విద్యార్థి వందలోపు ర్యాంకు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి చెంచు రామారావు, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, అంగన్ వాడీ కార్యకర్త వై. యశోద పాల్గొన్నారు.